హాస్యకథ

# వినరా! -'వియోగి'

హనుమంతరావుకు గుండె ఆగినంత పనై పోయింది ఆశ్చర్యంతో.

'ఆ:! హూ:!' అని కేకవేసి కూలబడిపోయాడు. అతను కరాటే విద్యలో కూడా ఆరితేరిన వాడవడంతో కుటుంబ సభ్యులెవరూ ముందస్తుగా పట్టించుకోలేదు.



కాని కూలబడ్డ శాల్తీ నిమిషాలు గడిచినా కుదేసిన బస్తాలాగా ఉండే సరికి కూసింత అనుమానం కలిగింది ముందుగా బుజ్జిగాడికి.

'అమ్మోయ్! హనుమగాడు బాల్చీ తన్నేశాడు' ఖంగారుగా గావుకేకలు పెట్టాడు.

అతగాడి తండ్రి ఆంజనేయులు ఆఘమేఘాల మీద వచ్చి హనుమంతరావు వాలకం చూసి.. చిటికెలో విషయాన్ని గ్రహించి.. అలనాడు సంజీవని పర్వతాన్ని తెచ్చిన మారుతిని తలపిస్తూ భుజం మీద బిందెమోస్తూ నీళ్ళు తెచ్చి హనుమంతరావు శాల్తీ మీద గుమ్మ. రించాడు.

సదరు హనుమంతరావు చలికి గజిబిజి అయిపోయి మళ్ళీ ఆ: ఊ: అంటూ అరిచి లేచి నిల్చున్నాడు అదాటున. అతని తలకాయపోయి వంగి ఉన్న ఆంజనేయులుకు తగ్లిలి.. అతని పళ్ళుపోయి నాలికలో గుచ్చుకుని రక్తస్రావమయింది.

అయినా కూడ చచ్చిబ్రతికిన చిరంజీవిని చూస్తూ కించిత్తు గర్విస్తూ సంగతేమిటని అడిగాడు.

హనుమంతరావు మళ్ళీ జర్మనీ భాషలో ఏవో సంజ్ఞలు గట్రా చేశాడు. భాష అర్థం కాకపోయినా అతని కాళ్ళూ చేతులూ కదలాడ్డం, తదితర అంగికాభినయాల వలన అతగాడికి ఏదో కవరొచ్చిందని దారిలోనే కొంపమునిగే వార్త ఉందని అర్థమైంది.

ఆంజనేయులు ఆ కవరును పట్టుకుని జాగ్రత్తగా లోపలి నుండి కాగితం లాగాడు బయటకు.

"వార్నీ!" అని అరిచి చెట్టంత మనిషి చాపచుట్టలా పడిపోయాడు.

అదృష్టం కొద్దీ ఇందాకటి బిందెలో ఇంకా నీళ్ళు మిగిలి ఉండడంతో... హనుమంతరావు లాఘవంగావాటిని ఆంజనేయులు మొహాన జల్లాడు.

"ఎంతటి వాడివైపోయావురా? ఆఖరికి రేడియోలో కూడా నీ నాటకం వస్తున్నదన్న మాట!" గాల్లోకి వెర్రి చూపులు చూస్తూ వర్రీ అయిపోయాడు.

అంతే!

హనుమంతరావు అప్పటి నుండి గాల్లో తేలియాడ్డం మొదలెట్టాడు.

హనుమంతరావు తనకు కావాల్సిన వాళ్ళందరి లిస్టు తయారు చేసుకున్నాడు.

ఈ ఊళ్ళో ఉన్నవాళ్ళకు స్వయంగా ముఖాముఖీ చెప్పదల్చుకున్నాడు. ఊళ్ళకి పోయి చెప్పాలంటే

ఖర్చు, శ్రమ, సెలవుదండగ ఎందుకని ఉత్తరాలు రాద్దామని నిశ్చయించుకున్నాడు.

రోజులు దగ్గరపడుతున్నాయి. హనుమంతరావు హడావిడి కూడ ఎక్కువవుతున్నది.

ఆ ఊరికల్లా ఏకైక కవి (ఆ ఊరి జనాల భాషలో చెప్పాలంటే... రాసేది ఏదైనా కానివ్వండి.. వాడు కవిగాడే) తానే అన్నట్లు గారాలు పోతూ తన దుస్తుల విషయంలో కూడా శ్రద్ధ తీసుకున్నాడు.

గిరజాల జుట్టు లేకపోయినా ఉన్న బొచ్చును బార్బరు పాలు కాకుండా జాగ్రత్తపడ్డాడు.

"అప్పారావు.. వచ్చేవారం నా నాటకం వస్తుంది. రేడియోలో వినరా! విని నీ అమూల్యమైన అభిప్రాయం చెప్పు" సదరు అప్పారావును కాఫీకి తీసుకుపోయి చిన్నగా చెప్పాడు.

అప్పారావు అర్భకుడు.. అదేదో బూతు మాటలాగా వినిపించి కాఫీ పొలమారింది ప్యాంటు మీద చొక్కామీద పడింది కాఫీ.

హనుమంతరావు ఆపాట్న నడినెత్తిమీద ఒక్కటి కొట్టాడు. అప్పారావు సర్దుకున్నాడు మంచినీళ్ళు తాగి.

"ఎంత దిగజారిపోయిందిరా! ఆఖరికి నీ నాటకం కూడా ప్రసారం చేస్తున్నారన్న మాట! బ్రహ్మంగారు అప్పుడే చెప్పారులే! పిదపకాలం పిదప బుద్ధులు, కలియుగాంతం అయ్యేట్లు కన్పిస్తున్నది." అప్పారావు నిట్టూర్చాడు.

"అదేంటి! నా నాటకం రావడానికి కలియుగాంతానికి సంబంధమేమిటి?" హనుమంతరావుకు అర్థంగాక నిలేశాడు అప్పారావును.

"అదంతేలే! అప్పటికి పట్టపగలే చుక్కలు పొడుస్తాయిట! కొండారెడ్డి బురుజు మీద కాకివాలి నీళ్ళు తాగుతుందట... లేపాక్షి బసవన్న లేచి రంకె వేస్తాడట. ఆకాశం నుండి నిప్పులవర్షం కురుస్తుందట.. బహుశ! నీ నాటకం గురించి కూడ చెప్పే ఉంటాడు ఆయన."

"సరే లేవోయ్! విని నువ్వే చెప్పు బైదిబై! ఆటోగ్రాఫు కావాలంటే ఇప్పుడే ఇస్తాను. తర్వాత తీరిక ఉంటుందో ఉండదో అభిమానుల గొడవతోటి."

"సరేలే... ఆ ముందురోజు కొంచెం గుర్తుచెయ్యి."

అప్పారావు తాపీగా చెప్పి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం అమృతరావు కన్పించాడు. విషయం వివరంగా రంగరించి వినమని మనవి చేశాడు.

"నీ నాటకమా? ఎప్పుడూ?"

"వచ్చే వారం...."

"టీవీలోనా...?"

"ఛీ టీవీలో కాదు.. రేడియోలో!"

"రేడియోలోనా! టీవీలో అయితే చెప్పు"

"అయితే ఏంలే విను" టీవీలో తన నాటకం రానందుకు చిన్న బుచ్చుకుని చెప్పాడు.

"సారీ! టీవీ వచ్చింతర్వాత మా ఇంట్లో రేడియోను పాత సామానులవాడికి అమ్మేశాం..నా దగ్గర లేదు" చెప్పేశాడు అమృతరావు.

ఆ సాయంత్రం ఆయన కనిపించాడు. లేదా అతగాడు కనిపించేట్లు ఇతగాడు వెతుక్కుంటూ పోయాడు. వెదకబోయిన తీగ కాలికి తగిలి బోర్లా పడ్డాడు. ఆయన పట్టుకున్నాడు పడకుండా.

"గురూ! నా నాటకం వస్తుంది.. రేడియోలో... విను..." టెలిగ్రాఫిక్ కోడ్‌లో అన్నీ చెప్పేశాడు.

"అదేంటి? నీ స్నేహితుడి నాటకం ప్రసారమవుతుంటే నువ్వు గర్వించదగ్గ విషయం కాదు?" సూటిగా అడిగాడు.

"అవునయ్యా ప్రసారం అవుతుంది! అయితే నాకేంటి?" మళ్ళీ అదే ప్రశ్న.

చిర్రెత్తుకొచ్చింది.

"రేడియోలో విని ఓ కార్డు ముక్క రాయవయ్యా మొగడా!"

"ఖర్చవుద్ది!" తాపీగా చెప్పాడు.

"ఆఁ! ఎంత?"

"సింపుల్‌గా ఫైవ్ స్టార్ హోటల్లో డిన్నర్.."

"సరేలే... విని చెప్పు?"

"అదిసరే... మరి రేడియో నువ్వు కొనిస్తావా?"

"రేడియో నేను కొనడమేంటి?"

"మాది ఎప్పుడో అటకెక్కేసింది. పనిచెయ్యదు" ఆయని లాపాయింటు చెప్పాడు.

"ఆ టైముకు నువ్వే మా ఇంటికి రా" చెప్పాడు.

ఆఫీసులో అందరికీ వినమని నోటీసు బోర్డులో పెట్టించాడు. దాని ఖరీదు యస్‌కేసే అని తర్వాత తెల్సింది. ఓ నాలుగొందలకు రెక్కలొచ్చేశాయి.

ఆ తర్వాత ఆఫీసరు పిల్చి చివాట్లేశాడు.

"హనుమంతరావు.. ఇలాంటి నాటకాలు రాయడానికి పర్మిషన్ తీసుకున్నావా? ఆఫీసు పని ఎగ్గొట్టి నాటకాలు రాస్తున్నావా! ఇలాంటి తప్పుడు పనులు ఇంకెప్పుడు చేయమాకు. ఆఁ!" అని వార్నింగ్ ఇచ్చాడు.

సత్యానందంకు అయితే అనుమానం వచ్చేసింది. మనసులో ఉంచుకోకుండా అడిగేశాడు.

"గురూ! దాన్ని కాపీకొట్టి రాశావు మనలో మాట!"

తర్వాత తేలిందేమంటే చాలా మంది దగ్గర రేడియోలు లేవు.ఉన్నా వినరు. ప్రస్తుతం టీవీ చూడ్డం ప్యాషన్!

ఎప్పుడు ప్రసారమయ్యేది చెబితే "అబ్బో! ఆ టైంలో టీవీలో మంచి ప్రోగ్రాం వస్తుందే!" అని వాపోయారు.

ఒళ్ళుమండి ఓ గుండూరావు టీవీలో వస్తుందాని అడగ్గానే 'ఆ వస్తుంది చూడండి' అని చెప్పాడు. అదే డేటు, టైం కాని ఆ గుండూరావు ఇసుమంతమైనా

## పరిచయం



కోపల్లి విజయప్రసాదు

పేరు : కోపల్లి విజయప్రసాదు

తలిదండ్రులు: విమలాదేవి,సుబ్రమణ్యేశ్వర రావు

నివాసం : కర్నూలు

రచనలు : "విలువలు" అనే రేడియో నాటకానికి జాతీయ స్థాయి బహుమతి లభించింది.

అభిప్రాయం: చెత్త కథలు-రాసి సమాజాన్ని చెడగొట్టే కంటే రాయకుండా ఉండడమే నిజమైన సాహిత్య సేవ అని భావించే వాళ్ళల్లో నేనొక్కణ్ణి.

మంచికథకు పాఠకుల నుంచి సరైన స్పందన రావాలనీ ఆ స్పందనే రచయితకు ఊపిరి పోస్తుందని నా ఉద్దేశం.

సాహిత్యం భ్రష్టు పట్టకుండా కాపాడవలసిన బాధ్యత సంపాదకులతో పాటు పాఠకులకి కూడా ఉంది.

నా కథలనూ, నన్నూ ప్రోత్సహిస్తోన్న అమృతకిరణ్‌కు నా కృతజ్ఞతలు!

చలించకుండా ' ఇప్పుడు దూరదర్శన్ ఎవరు చూస్తున్నారు... స్టార్.. జైన్... జీటీవీ తప్ప... వాటిలో వస్తే చెప్పు' అని తప్పించుకు వెళ్ళిపోయాడు.

హనుమంతరావుకు కొంచెం కొంచెం అర్థమైంది. ఆ సమాజంలో కవులకు ఎంత విలువుందో!

దూరంగా చూసి ఆనందించే వాళ్ళకి... ఆ ఆనందాన్ని కలిగించిన రచయిత దగ్గరకు వచ్చి పలకరించినా పట్టించుకోరని అర్థమవసాగింది.

రచయితను వాస్తవంలో భరించ లేరని.. అతనొక వ్యర్థజీవి అని!

తన నాటకాన్ని రికార్డు చేసుకోవడానికి విస్తృతమైన ఏర్పాట్లు చేసుకున్నాడు హనుమంతరావు రెండు మూడు సావుల్లో చెప్పాడు కూడ.

తీరా ఆరోజు రానే వచ్చింది. రేడియో పెట్టేలోగా విద్యుత్ శాఖ వారి పుణ్యం మూలంగా కరెంటు పోయింది.

ఆఘమేఘాల మీద పోయి బ్యాటరీలు తెచ్చి వేశాడు. అప్పటికే టైం మయిపోయిందని వర్రీ అయ్యాడు.

మరునాడు అప్పారావు కనిపించాడు. తప్పించుకు వెళ్ళబోయి ఆగి అభినందించాడు.

"నీ నాటకం చాలా బావుంది సుమా! వింటున్నంత సేపూ నువ్వేనా రాసింది అన్నంత గొప్పగా ఉంది. తొందరలోనే టీవీలకు రాస్తావని ఆశిస్తున్నా!"

అభినందిస్తూంటే వెర్రిమొహం వేసుకుని చూశాడు. అప్పారావు అవేం పట్టించుకో కుండా వెళ్ళిపోయాడు.

చాలా మంది వచ్చి తాము నాటకం వినలేక పోయామని కేబుల్లో మంచి సినిమా వేశారని చెప్పారు. ఓ పిచ్చి నవ్వు నవ్వి ఊరుకున్నాడు.

ఎస్కేసే తీసుకున్న వాళ్ళల్లో చాలా మందికి అస్సలు ఆ ప్రస్తావనే గుర్తులేదు కాబట్టి.. అతణ్ణి ఎవరూ పట్టించుకోలేదు.

ఆఫీసరు పిల్చి రేడియోలకు డ్రామాలు రాయద్దు.. టీవీకి సినిమాలకు గట్రా రాస్తె అందరం చూస్తాం. అని సెలవిచ్చారు. రేడియో వినడం ఆయనగారి స్టేటస్‌కు తక్కువన్నట్లు ఫీలయిపోతూ.

ఆయన ఆ మరునాడు వచ్చి పార్టీ అడిగాడు.

"ఇంతకూ నా నాటకం ఎలా ఉంది?" అడిగాడు అతణ్ణి.

"సారీ గురూ! చెప్తేగదా! నా రేడియో అటక ఎక్కిందని. అప్పటికి చుట్టు పక్కలవాళ్ళు ఎవరైనా ఇస్తారేమోనని జల్లెడపట్టి గాలించాను... ఎవరిళ్ళల్లోనూ రేడియోలు లేవు.. అంటే ట్రాన్సిస్టర్లు కూడా లేవని అర్థం... మా రేడియో అటక ఎక్కింది.. అది రిపేరు కూడా కాదు అందుకనే నీ నాటకం వినలేదు. అయినా టీవీకి రాయి గురూ!" ఆయని సంజాయిషీ ఇస్తూ చెప్పాడు.

"అవునీ! అటక ఎక్కింది మన రేడియో కాదు... మన అభిమాని! సాహిత్యం పట్ల... సంగీతం పట్ల... విజ్ఞాన వినోదాల పట్ల మనకున్న ఆసక్తి అటకెక్కింది. అందుకే మనం ఇలా బయటున్నాం!

హనుమంతరావు ఏడుస్తూ చెప్పాడు.

నిజం ఏమిటంటే ఆరోజు నాటకం బదులు క్రికెట్ కామెంటరీ ప్రసారం అయింది. ★


-కె.విజయప్రసాద్
ఏ.డి.ఓ.జీవిత భీమా సంస్థ
పి.బి.నం.11, పార్కురోడ్
మేడం కాంపౌండ్,
కర్నూలు - 518 001.

## బికినీ తంటా



రాకేష్ రోషన్ దర్శకత్వం వహిస్తోన్న 'కారోబార్' చిత్రం షూటింగ్ ఇటీవల సౌత్ ఆఫ్రికాలో జరిగింది. అక్కడ ఓ పాటలో జూహీచావ్లా పాల్గొనాల్సి ఉంది. అయితే చివరి నిమిషంలో డాన్స్ డైరెక్టర్‌ని మార్చమని పట్టుబట్టింది జూహీ. పైగా లేడీ డాన్స్ డైరెక్టరే కావాలంది. రాకేష్ ఎంత నచ్చచెప్పినా వినలేదట. చివరికి చేసేదేం లేక అక్కడున్న డాన్స్ డైరెక్టర్ చిన్ని ప్రకాష్‌ని వెనక్కి పంపించి అర్జెంట్‌గా రమ్మని లేడీ డాన్స్ డైరెక్టర్ సరోజ్‌ఖాన్‌కి కబురందించాట్ట రాకేష్. ఇంతకీ జూహీ..లేడీ డాన్స్ డైరెక్టర్‌నే ఎందుకు డిమాండ్ చేసిందో తెలుసా? ఆ పాటలో టూపీస్ బికినీతో డాన్స్ ఉందిట!

-మౌర్య.




వీర్ల గంగాధర్, చాగల్లు - పోస్ట్, మండలం: పశ్చిమగోదావరి - జిల్లా - 534 342.